క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడి



కల్లూరు(పులిచెర్ల): మండలంలోని బోడిరెడ్డిగారిపల్లె, కల్లూరు, పాతపేట పంచాయతీల్లో శుక్రవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసి నష్టం కలిగించాయి. చేతికొచ్చిన వరి, పూల తోటలను తొక్కి ధ్వంసం చేయడంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. అటవీ అధికారులు ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నా ఆచరణలో చర్యలేవీ తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

దాసార్లపల్లెలో 'వృద్ధుల దినోత్సవం'



వృద్ధులతో మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లెలో శుక్రవారం వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ మాట్లాడారు. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోతుండటంతో వృద్ధుల బాగోగులు చూసేవారు లేక ఒంటరిగా మిగిలిపోతున్నారన్నారు. దీంతో వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్నారు. వృద్ధుల సంరక్షణ, సహాయ వ్యవస్థలను బలోపేతం చేయవలసిన అవసరాన్ని వివరించారు. పోషకాహారం విధిగా తీసుకోవాలని, వైద్యాధికారుల సలహాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది నవీన, కవిత, మునిలక్ష్మి, రామానుజమ్మ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా సిబ్బంది

వి.కోట: టార్గెట్ల పేరిట తమను వేధించడం ఆపాలని తపాలా శాఖ సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తపాలా శాఖ కార్యాలయం వద్ద సిబ్బంది నల్ల బ్యాడ్జీతో నిరసన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు రెండవ రోజు తపాలా సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహించారు. బ్రాంచ్ ఆఫీస్ సిబ్బంది, యూనియన్ నాయకులు శ్రీనివాసులు, త్యాగరాజు, మురళి, శ్రీధర్, తిమ్మరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పరమేశ్వర రెడ్డి



రొంపిచెర్ల: ఎంపీడీఓగా పరమేశ్వరరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న రాజేంద్ర సెలవుపై వెళ్లారు. దీంతో యాదమర్రిలో పని చేస్తున్న పరమేశ్వరరెడ్డిని రొంపిచెర్లకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులకు అందేలా చూస్తానన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పౌష్టికాహారం



రోగులకు భోజనం అందిస్తున్న డాక్టర్లు

బంగారుపాళెం: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు శుక్రవారం నుంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. వివిధ జబ్బుల కారణంగా ఆస్పత్రిలో చేరిన వారికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టిఫిన్, భోజనం అందించనున్నట్లు తెలిపారు. రోగులకు పెట్టే భోజనంలో లోపాలు తలెత్తితే చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు శాలిని, స్వరూప్, అఖిల్, హెడ్‌నర్సులు సుమతిభాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఐరాల: గ్రామీణులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యకరంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గృహ రాజకీయం..!

- లబ్ధిదారుల ఆశలను నీరుగారుస్తున్న కూటమి ప్రభుత్వం
- ׀మన ఇల్లు–మన గౌరవం* పేరుతో హడావుడి
- ఆరునెలల్లో పూర్తి చేయాలంటూ మెలిక
- లేదంటే ఇంటి పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరిక



లక్కనపల్లెలో హౌసింగ్ లేఔట్‌లో నిర్మిస్తున్న గృహాలు



బైరెడ్డిపల్లె జగనన్న కాలనీలో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. పేదల సొంతింటి ఆశలపై నీళ్లు చల్లుతోంది. ×మన ఇల్లు..మన గౌరవం₹ పేరుతో హడావుడి చేయడం, అర్ధంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను మార్చిలోపు పూర్తి చేయకపోతే ఇంటి పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరిస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పైగా గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ప్రకటించడం చూస్తే ఇది పక్కా రాజకీయమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బైరెడ్డిపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలతో పాటు పక్కా గృహాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. 2021లో మండల కేంద్రంతోపాటు ఆల్లపల్లె, బేలుపల్లె, చప్పిడిపల్లె, దేవదొడ్డి, ధర్మపురి, గంగినాయనపల్లె, గడ్దూరు, కమ్మనపల్లె, కంభంపల్లె, లక్కనపల్లె, నెల్లిపట్ల, తీర్థం, పాతురునత్తం, పెద్దచల్లారగుంట గ్రామాల్లో మొత్తం 2,415 మంది గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. ఇందులో హౌసింగ్ లేఔట్ కింద 1,976, సొంత స్థలం కింద 439 మంది చొప్పున పేదలకు సొంతిళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.80 లక్షల సాయంతో పాటు పొదుపు మహిళలకు అదనంగా బ్యాంకుల నుంచి రూ.35వేలు, మరో రూ.20 వేలు ఉపాధి పథకం కింద వర్తించేలా ఏర్పాటు చేశారు అధికారులు. అలాగే ఇసుక, ఇనుపకమ్మీలు, సిమెంటును ఇచ్చారు. ఫలితంగా ఎంతో మంది సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. జగనన్న కాలనీలు సర్వాంగసుందరంగా మారాయి. విద్యుత్, తాగు నీటి వసతి కల్పించారు. జగనన్న కాలనీలు ఊళ్లను తలపిస్తున్నాయి. సీసీ రోడ్లు వేయాలనే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అలాగే 902 గృహాలు మాత్రం వివిధ దశల్లో నిలిచిపోయాయి.

ఇళ్ల స్థలాల పంపిణీ ఏదీ?

తాము అధికారంలోకి వస్తే పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని, ఇళ్ల నిర్మాణాలకు ఏకంగా రూ.4 లక్షలు మంజూరు చేస్తామని టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా ఇంటి స్థలం కోసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదని పేదలు మండిపడుతున్నారు. మన ఇల్లు..మన గౌరవం పేరుతో లేఔట్ల వద్ద లబ్ధిదారులు, అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేయడంపై తప్పితే, ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం కల్పించని ఈ సమావేశాలు ఎందుకని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు.

గడువు తర్వాత నిర్మిస్తే బిల్లుల నిలుపుదల



గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో 16 గ్రామాల్లో హౌసింగ్ లేఔట్ కింద 1979 మంది, సొంత స్థలం కింద 439 మంది కలిపి మొత్తం 2415మందికి ఇళ్లు మంజూరు చేశాం. వీటిలో ఇప్పటి వరకు 1513 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ ఇళ్లను వచ్చే మార్చినాటికి పూర్తి చేసుకోవాలి. గడువు తర్వాత నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు నిలిపేస్తాం.

–స్వామిదాస్, హౌసింగ్ ఏఈ, బైరెడ్డిపల్లె

నేడు శ్రీనివాస కల్యాణోత్సవం

కుప్పం రూరల్: కుప్పం మండలంలో బేటరాయ స్వామి కొండపై ఉన్న శ్రీ వేట వేంకటరమణ స్వామి ఆలయం వద్ద శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఏటా పెరటాసి నెల 3వ శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరు కావాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం కొండ వద్ద రాకపోకల నిమిత్తం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుండడంతో నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

సబ్‌స్టేషన్‌లో చెట్లు మాయం!

- ఇంటి దొంగల చేతివాటం
- లక్షలాది విలువ చేసే చెట్లు నరికివేత
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



అకేషా చెట్లను కోసి వేసిన దృశ్యం



చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద నరికేసిన వేప, అకేషా చెట్లు

చౌడేపల్లె: మండల కేంద్రంలో చిట్రెడ్డిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్‌లో విలువైన కలప చెట్లు మాయం అవుతున్నాయి. సుమారు 20 ఏళ్ల నాటి వృక్షాలను అక్కడి సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే అకేషా, వేప చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాత్రికి రాత్రే చెట్లను మొదలు వరకు కోసేసి మాయం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో మిగిలి ఉన్న వృక్షాలైనా నరికివేతకు గురికాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ ను సెల్‌ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

రేపు 'దుర్యోధన వధ'

సదుం: మండంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

డ్రైడే పాటించండి



నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: వారానికోసారైనా ఇళ్లలో డ్రైడే పాటించాలని సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ కోరారు. శుక్రవారం స్థానిక వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటిటా లార్వా నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్ల వద్ద నిల్వ ఉంచిన నీటిని పారబోశారు. దోమల వల్ల వచ్చే జ్వరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అముదా, ఆశావర్కర్ రమాదేవీ పాల్గొన్నారు.

అశ్వియ కుటుంబీకులకు పరామర్శ



పుంగనూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పుంగనూరు: పట్టణంలో కిడ్నాప్, హత్యకు గురైన చిన్నారి అశ్వియ అంజుమ్ కుటుంబ సభ్యులను తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారి హత్యను ఖండిస్తూ పట్టణంలోని అన్ని వర్గాల వారు బాధిత కుటుంబానికి సంఘీభావం ప్రకటించడం హర్షణీయమని, కులమతాలకతీతంగా వేలాది మంది పట్టణ ప్రజలు బాధిత కుటుంబానికి వెన్నంటే నిలిచారని, ఇది పట్టణ ప్రజల మధ్య ఐక్యతను నాటిచెప్పిందన్నారు. పోలీసులు జాప్యం చేయకుండా నిందితులను అరెస్ట్ చేసి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్లు అమ్ము, రేష్మ, సాజిదాబేగం, జేపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా భూసార పరీక్షలు

- ప్రతి రైతుసేవా కేంద్రానికి భూసార పరీక్షల కిట్
- 8 మండలాల సిబ్బందికి అవగాహన సదస్సులో ఉద్యానవన శాఖ డీడీ మధుసూదనరెడ్డి



మాట్లాడుతున్న డీడీ మధుసూదనరెడ్డి

చౌడేపల్లె: డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ హైదరాబాద్ సహకారంతో ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి లోపాలను రైతులకు తెలియజేస్తామని ఉద్యానవనశాఖ డీడీ మధుసూదనరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, గంగవరం మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు సేవా కేంద్రానికి ఒక కిట్ ఇచ్చామన్నారు. వీటితో 50 మంది రైతుల పొలాల్లో భూసార పరీక్షలను నిర్వహిస్తామన్నారు. రైతులు పొలంలో 2 అడుగుల లోతుకు గుంత తీసి మట్టిని తీసుకొస్తే వెంటనే పరీక్షలు నిర్వహించి భూమిలోని లోపాలను వివరిస్తామన్నారు. సమావేశంలో హెచ్‌ఓలు సంతోషికుమారి, వరప్రసాద్, యశోద తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతు సేవా కేంద్రాల సిబ్బంది

ప్రజలందరికీ దుర్గామాత కరుణాకటాక్షం



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పార్వతీదేవిగా వాసవీమాత

వి.కోట: దుర్గామాత కరుణా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉంటూ అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మొక్కారు. శుక్రవారం స్థానిక దుర్గానగర్‌లోని శ్రీ దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలకు జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి స్వాగతం పలికి సత్కరించారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారికి పార్వతీదేవి అలంకరణ చేసి ఉయ్యాలసేవ నిర్వహించారు. వందలాది మహిళా భక్తులు పాల్గొన్నారు. అలాగే, కేపీవీధిలోని శ్రీ వాసవీమాత విశేష అలంకరణలో పార్వతీదేవిగా భక్తులకు కనువిందు చేశారు.

నమో మాతా.. నమో స్తుతే..



పలమనేరు: గాయత్రిదేవిగా దుర్గమ్మ, ఆదిలక్ష్మి అవతారంలో శ్రీమలాలమ్మ, రొంపిచెర్ల: దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ, రామకుప్పంలో..

పలమనేరు: దసరాఉత్సవాలో భాగంగా రెండోరోజైన శుక్రవారం దుర్గాదేవి బాలత్రిపురసుందరి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పాతపేటలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆదిలక్ష్మి అవతారం

గంగవరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేలుమాయి క్రాస్‌లోని శ్రీ మలాలమ్మ శుక్రవారం ఆదిలక్ష్మి అలంకరణలోకి భక్తులను కటాక్షించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. శనివారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాలత్రిపుర సుందరి అలంకరణలో సల్లాపురెమ్మ



బైరెడ్డిపల్లె: బాలత్రిపురసుందరిగా సల్లాపురెమ్మ

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలోని శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. తీర్థంలోని శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో ఉదయం మంటపోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని హంసవాహనంపై కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు. బైరెడ్డిపల్లె శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బాట గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గాదేవి అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో శుక్రవారం కొలువుతీరారు. ఆలయ అర్చకులు గుణ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయాన అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని బ్యాండు మేళాలతో పుర వీధులలో ఊరేగించారు. ఉభయదారులుగా శెట్టిపల్లె గుణశేఖర్, కోమలత దంపతులు వ్యవహరించారు.

కుంకుమ అలంకారంలో వాసవీమాత

రామకుప్పం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం వాసవీ అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామకుప్పం, ఆనిగానూరు కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో వాసవీమాతకు ఉదయం ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రూ.250 కోట్లతో కోళ్ల మాంసం ఎగుమతి పరిశ్రమ

- కోళ్ల మాంసం వ్యర్థాలతో పంటలకు నష్టమని రైతుల ఆక్షేపణ
- రైతులతో కలిసి కంపెనీ ప్రతినిధులతో చర్చించిన ఆర్డీఓ
- పరిశ్రమ ఏర్పాటు పరంగా అన్ని ప్రమాణాలు పాటిస్తామని ప్రతినిధుల హామీ
- 2వేల మందికి ఉపాధి కలుగుతుందని స్పష్టీకరణ
- సందేహాల నివృత్తికి ఔరంగాబాద్ యూనిట్ సందర్శనకు తీసుకెళ్తామని సంసిద్ధత



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రాజు

గుడుపల్లె: కోళ్ల మాంసం ప్యాకింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తే తాము తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందని ఆర్డీఓ శ్రీనివాస్‌రాజుకు రైతులు నివేదించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులు, కోళ్ల మాంసం ప్రాజెక్టు అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని పాగురుపల్లె గ్రామ సమీపంలో 30 ఎకరాల్లో రూ.250కోట్లతో కోళ్ల మాంసం పరిశ్రమ ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతించింది. దీంతో పరిశ్రమదారులు ఇక్కడ భూమి చదును పనులకు శ్రీకారం చుట్టారు. దీనిని రైతులు ఆక్షేపించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తే పాగురుపల్లె, దాసిమానిపల్లె, కె.గొల్లపల్లె, ఆవుల చెరువు, బిసానత్తం గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు గ్రామాల రైతులు సాగు చేసిన పంటలు, సెరికల్చర్‌కు నష్టం వాటిల్లుతుందని, కోళ్ల మాంసం వ్యర్థాలు, వాటి దుర్వాసన వల్ల పంటలకు వైరస్ ఆశించి నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీఓ స్పందించారు. రైతులు నివేదించిన సమస్యపై కోళ్ల మాంసం పరిశ్రమ ప్రతినిధులతో చర్చించారు. తమకు ఔరంగబాద్‌లో కోళ్ల మాంసం ఉత్పత్తి పరిశ్రమ ఉందని, అక్కడ పరిశ్రమ నిర్దేశిత ప్రామాణిక నిబంధనల మేరకు అన్నీ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ కేంద్రానికి పట్టు పరిశ్రమ శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులను సందర్శనకు తీసుకెళ్తామని, తద్వారా వారి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. తాము విదేశాలకు ప్రాసెస్డ్ కోడి మాంసం ఎగుమతి చేస్తామని, ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుతో 2వేల మందికి ఉపాధి కలుగుతుందని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. తహసీల్దార్ సీతారాం, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, నాయకులు టీఎం.బాబునాయుడు, కోళ్ల మాంసం ఉత్పత్తి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.